# ఆగని కృష్ణార్జునుల వివాహం

''కృష్ణా. బి.ఏ. ప్యాసయిన తరువాత నీ కళాతృష్ణ తీర్చుకోవటంకోసం ఆర్ట్సు స్కూల్లో చేరావు. ఇంకా రెండేళ్ళ కోర్సు ఉందంటున్నావు. అంతవరకూ నీపెళ్ళి ఆపటానికి వీల్లేదమ్మా. నీ తరువాత ఇద్దరు చెల్లెళ్ళు పట్టభద్రలై ఇంట్లో ఉన్నారు. నీకు ముందు పెళ్ళి చెయ్యాలని అమ్మ అంటోంది. అంతగా నీకోర్సు పూర్తిచేయ్యాలని ఉంటే పెళ్ళి అయిన తరువాత చేసుకో. ఇంక అడ్డం చెప్పకు'' భోజనాల సమయంలో తల్లి కనకమ్మ అనాలనుకున్న మాటలు తండ్రి అనంత రావు అన్నాడు.

దిగ్గున తలఎత్తింది కృష్ణ.

''నాన్నా. నాచదువంటే అక్కకూ నీకూ ఎందుకంత నిరాదరణ ? అంత కసి ఎందుకు ? అది నామీదనా ? లేక నా చదువు మీదనా ? ఆర్ట్సుస్కూల్లో ఇంకా రెండేళ్ళు ఉండాలని ముందే చెప్పాను. చేరమని ముందు నీవే ప్రోత్స హించావు. ఇప్పుడు సగంలో మానెయ్యమంటావా ? పైగా పెళ్ళయిన తరువాత చదువుకోవచ్చంటున్నావు. తరువాత సాగుతుందో సాగదో నీవు దృఢంగా చెప్పగలవా ? ఇంతకష్టపడిందీ వృధాయేనా చెప్పండి ?"

కృష్ణ ఇంతవరకు తల్లిదండ్రులకు ఎదురు చెప్పలేదు. కాని - అనంత రావు ఈమధ్య వారానికొకసారయినా తన ఆర్ట్సుస్కూలు సంగతి ఎత్తి నిరుత్సాహ పరచటమేకాదు - మాన్పించాలని చూస్తున్నాడు. మొదట్లో తండ్రి ఆ ప్రసక్తి తెచ్చినప్పుడు నవ్వి ఊరుకునేది. తరువాత తరువాత తలవంచుకుని మౌనంగా కూర్చునేది. విసుగనిపిస్తే ఆయన ఎదురుగా ఉన్నా లేచివెళ్ళిపోయేది.

కనకమ్మ మాత్రం అనంతరావును నిలవనిచ్చేది కాదు. రాత్రిళ్ళే కాక పగలు ఆయన కనబడినప్పుడల్లా ఒకటేపోరు పెట్టేది. ఆ పోరువల్లే తెల్లవారే సరికి కృష్ణ కంటికి కనబడగానే ఆవిర్లుగ్రక్కుతూ తండ్రి నోటివెంట అయిష్టత

బైటికి వచ్చేది. గడిచిన రాత్రి తండ్రికి నిద్రలేదని కృష్ణవెంటనే గ్రహించేది. ఆవిషయం శృతిమించి పోతున్నదని నోరువిప్పి తన మనసులో ఉన్నమాట ఆనాడు బైటపెట్టింది.

“మనమనుకున్న పిల్లవాడు తన ఉద్యోగాన్ని అవసరమయితే ఇక్కడికి మార్పించుకుంటాడట. తల్లిదండ్రులను ఒప్పించాడటకూడా” అన్నది కనకమ్మ.

కృష్ణ ఓపిక ఆనాడు సరిహద్దులు దాటింది. ఆమె ఇంక సహించలేక- “మనమనుకున్న పిల్లవాడంటే ! ఎవరా అనుకున్నది ? మిరిద్దరేనా అనుకున్నది ? నన్నేమయినా సంప్రతించారా ? నా జవాబుకోసం చూడకుండా వాళ్ళకు మాట ఇచ్చి, అతడు ఇక్కడికి తన ఉద్యోగాన్ని మార్చుకోవటానికి కూడా ఒప్పుకునేటట్టు చేశారా ?'' అనేసిందికోపంతో.

“ఇంతకూ నీవనేది ఏమిటి ? అతడు నచ్చలేదా ?”

“నచ్చటం నచ్చకపోవటంకాదు. మీకు ఆడపిల్లలకు పెళ్ళిళ్లుచెయ్యాలని ఉంటే 'చెల్లెళ్ళకు చెయ్యండి. నాకు మాత్రం ఇప్పుడు అవసరం లేదు” అని భోజనంచేస్తూ ఉన్నదల్లా పళ్ళెంలో నీళ్ళుపోసి వెళ్ళిపోయింది. అరగంట తరువాత బట్టలు మార్చుకుని ఆర్ట్సుస్కూలు వైపు బయలుదేరింది.

తల్లీ తండ్రీ ముఖాలు చూసుకున్నారు.

''పెద్దపిల్లను అట్లా ఉంచి చిన్నవాళ్లకుచేస్తే తరువాత దీనికి పెళ్లవుతుందిటండీ ? దీనికి ఏదో వంక ఉన్నదని అందరూ అనుకోరూ ? వదంతులు ఎంతలోకి పాకుతాయి ?” తల్లి గొడవచేయటం మొదలుపెట్టింది

అనంతరావు భోజనం చేసి లేచాడు.

కనకమ్మకు ముగ్గురాడపిల్లల తరువాత ఒక మగపిల్లవాడు ఆలస్యంగా పుట్టాడు. ఆడపిల్లలకు పెళ్ళిళ్ల చేసి పంపించి, కొడుకును పెద్దచదువు చదివించాలని, ఆలస్యంగా పుట్టినవాడిమీద ఆమెకు కొండంతకోరిక. అతడికి మంచి బట్టలు కుట్టించాలనీ, మంచి స్కూల్లో చదివించాలనీ, స్కూటర్‌మీదనే కాలేజీకి పంపించాలనీ అతడిని విదేశాలలో పెద్దచదువు చదివించటానికి ఇప్పటినుంచీ డబ్బు కూడబెట్టాలన్న కోరికను మాత్రం బయటపడకుండా తొందరగా పెళ్ళిళ్లు చెయ్యమని అనంతరావును నిలవనీయటంలేదు

ఆర్ట్సుస్కూల్లో మొత్తం పాతికమంది వరకూ విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. వాళ్ళలో నలుగురికి ఆఖరిదశ శిక్షణ నిస్తున్నాడు ఆచార్యుడు. శిక్షణా కాలమయిన తరువాత స్వతంత్రంగా చిత్రించిన చిత్రాలను ఆల్బమ్‌లో పెట్టు కుంటున్నారు విద్యార్థులు. కొందరు స్కూల్లోనే గోడలకు తగిలిస్తున్నారు. బాగా చెయ్యి తిరిగిన చిత్రకారులు చిత్రకళాప్రదర్శనలలో ప్రదర్శనకు పంపుతున్నారు.

ఆఖరి సంవత్సరంలో శిక్షణపొందే నలుగురిలో కృష్ణ, రేఖ ప్రథమ ద్వితీయ శ్రేణిలో ఉన్నారు. వీళ్ళిద్దరూ చిత్రించే చిత్రాలు చూసి ఆచార్యుడు సంతృప్తి చెందేవాడు. చిత్ర కళా ప్రదర్శనలకు పంపగల స్థాయికి చేరుకుంటున్నారిద్దరూ. ఆ రూపకల్పన-ఆ చిత్రణ-ఆ రంగుల-కలయిక 'మరో ప్రకృతిని సృష్టిస్తున్నారా' అన్నట్టుగా ఉండేవి. వీళ్ళిద్దరూ ఎప్పటికయినా మనదేశంలోనేకాక విదేశాలకు కూడా ఈ చిత్రాలు పంపి, పేరుతెచ్చుకోగలరనీ బహుమతులు పొందగలరనీ వాళ్ళ భవిష్యద్వాణిని గురించి అంచనాలు వేస్తూఉండేవాడు. గురువుకు శిష్యులు తనంతటివాళ్ళు కావాలన్న ఆశతో.

ఒకనాడు రేఖ ఒక చిత్రాన్ని కేన్వాసుమీద రూపకల్పనచేస్తున్నది. లంబాడీ వనితను గీసి అద్దాలుకుట్టిన లంగా అద్దాల రవికె. ఆ రవికెకు వెనకవైపు అద్దాలు గాని బట్టగాని లేకుండాతాళ్ళతో బంధించింది. ముఖమ్మీద పడే ముంగురులకు బరువైన గవ్వల వంటివి కట్టింది. చేతులనిండా ప్లాస్టిక్‌గాజులూ వేళ్ళకు ఉంగ రాలూ పెట్టింది. కాళ్ళకు ఘల్లు ఘల్లు మనే కడియాల వంటివి ధరింపచేసింది. లంబాడి యువతి తట్టనెత్తిన పెట్టుకుని ఐదారునెలల పసిపాపను వట్టినేలమీద గోనె తట్టూపరచి పడుకోబెట్టింది. తాను ముందుకు అడుగులువేస్తూ వెనక్కు తిరిగి, ఆ బిడ్డను ప్రేమనాలికించే కళ్ళతో లాలిస్తూ ''ఏడవకు ఈ తట్ట అక్కడ దించివస్తా''నని వెనక్కు తిరిగి చూసే చూపులలో అపూర్వమైన భావప్రకటనను కుంచెతో తీర్చిదిద్దుతున్నది.

ఇక కృష్ణ-బిడ్డతల్లి అయిన ఒక కూలి మనిషిని రూపకల్పన చేసింది. ఆమె పసిబిడ్డను అడ్డంగా బిడ్డముఖం కనబడేటట్టు బట్టతో నడుముకు కట్టుకున్నది. చందమామలాంటి బిడ్డముఖంలో నక్షత్రాల్లా మెరిసే కళ్ళనూ బోసినవ్వులనూ చూసి తలవంచి ముద్దిడబోతున్న సమయంలో-బిడ్డ తండ్రి వెనుకనుంచివచ్చి ముద్దుపెట్టుకుంటూ ఉండగా తనకంటె ముందుగా - ముద్దిడుకున్న భర్తలను

తమకంతో తన తలకానించుకుంది. రెండుచేతులతో ఆ కూలిమనిషి. ఆమె మెడలో పూసలదండలూ ముఖాన్ని కప్పుతున్న ముంగురులూ-పైకి ఎగ గట్టిన చీరె-గుండీలు లేని గళ్ళరవిక, తెల్లటి లోహపు కడియాలు కాళ్ళకూ, చేతులకు మురుగులతో అలంకరించుకుంది. వేషధారణ ఆమెకొక విధమైన సొగసును చేకూరుస్తూ 'అనాగరికతలో కూడా అందముంది సుమా !' అని తెలిపే విధంగా ఉంది.

ఆ చిత్రంలో బోసినవ్వుల పసిపాప ముఖంలోని భావాన్ని, తన ముద్దు బిడ్డను తల్లికంటె తండ్రి కొంటెనవ్వులతో దొంగచాటుగా ముద్దిడుకుంటూ పొందే ఆనందాన్ని, తనబిడ్డను అంతగా ప్రేమించి తన వెనకచాటుగా వచ్చి, తనకంటె ముందుగా ముద్దిడుకునే భర్తను ఆమె ఆప్యాయంగా తన తలకు అతడి తలను రెండుచేతులతో పట్టుకుని తాకిస్తూపొందే ఆనందాన్ని, ఆ ఆనందోద్రేకంలోని ఆమె చూపులనూ కృష్ణ అత్యద్భుతంగా చిత్రించిన రేఖాచిత్రానికి రంగులతో తుది మెరుగులు దిద్దుతున్నది.

ఆ రెండు చిత్రాలనూ ఆచార్యుడు చూశాడు.

బిడ్డముఖంలో కళ్ళల్లో ఒకవిధంగాను, చాటుగావచ్చి బిడ్డను ముద్దిడుకోబోయే భర్త ముఖంలో కళ్ళల్లో ఒకవిధంగాను, ఆప్యాయంగా తన తలను అతడి తలకు ఆనించి ఆమెపొందే ఆనందాన్ని, ఆ ఆనందోద్రేకంలోని చూపులనూ విభిన్న రీతులలో ప్రదర్శింపబడే భావాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కృష్ణను ఆచార్యుడు మరోసారి పరీక్షగా చూశాడు. ఆమె భావనా పటిమకు ఆయన కాశ్చర్యం కలిగింది.

ప్రేమ అనే భావాన్ని ఆయావ్యక్తుల మనోభావానికి తగినట్టు ప్రదర్శింపచేయటంలో కృష్ణ తన కళాకౌశలాన్ని అసామాన్యంగా అమోఘంగా చిత్రించిన తీరుకు ఆయన పొంగిపోయాడు.

ఈ చిత్రాలను రెండిటినీ తుదిమెరుగులు దిద్దిన తరువాత, తనదగ్గర పెట్టుకుని ఇంకేమయినా మెరుగులు దిద్దే అవసరముందేమోనని ఆచార్యుడు స్టాండు మీదనే ఉండనిచ్చాడు.

మరునాడు వచ్చిన శిష్యులనుకూడా అడిగాడు. మార్పును గురించి వాళ్లకు, అవసరమనిపించలేదు. తనకూ అవసరమనిపించలేదు.

ఈ తరుణంలో కృష్ణకు ఇంటి వాతావరణం సుముఖంగాలేదు. స్కూలు వాతావరణంలో ఆమెకు కలిగిన ఆనందం ఇంటికి రాగానే హరించుకుపోతున్నది.

"దానిష్టమేమిటి ? లగ్నాలు పెట్టించండి. ఎట్లా చేసుకోదో చూస్తానని" కన్నతల్లి గొడవచేస్తున్నది.

"కృష్ణ బుద్ధి తెలిసిన పిల్ల. అందులో చదువుకున్నది. బలవంతంగా చేసిన పెళ్ళిళ్ళు విషాదాంతమయ్యే అవకాశాలున్నాయి. పెళ్ళి అయింది కదా అని ఈ కాలంలో అందరూ సర్దుకుపోరు. నీవు దాన్ని బలవంతం చెయ్యకు. ఆ తరువాత విచారించవలసి వస్తుంది." అనంతరావు వామెను నిరుత్సాహ పరుస్తున్నాడు.

"అయితే కుదిరిన సంబంధాన్ని పోగొట్టు కుంటామా ? రెండోదాన్ని చూపించి చెయ్యండి. కృష్ణను దానికర్మకు దాన్ని వదలెయ్యటమే" అంటూ మరొక మార్గాన్ని సూచించింది తల్లి.

ఇంట్లో జరుగుతున్న విషయాలూ, చర్చలూ, ఘర్షణలూ కృష్ణచెవికి సోకుతునే ఉన్నాయి. అయినా ఆమె తన చిత్రాన్నిగురించి "ఇంకేమయినా మెరుగులు దిద్దగలనా?" అని ఆలోచిస్తునే ఉన్నది. ఆమె తనదగ్గరున్న దేశవిదేశాల చిత్రాల ఆల్బమ్‌లనూ, తను మొదటి నుంచీ వేసిన చిత్రాలను చూసుకుంటూ కూర్చుంది.

పెళ్ళికొడుకు పెళ్ళిచూపులకు వచ్చాడు. అనంతరావు కనకమ్మలు అతడిని చూస్తూనే "చాలా సంతోషం. మాటెలిగ్రాం చూసుకునే వచ్చారు కదా. మా వల్ల ఒక పొరబాటు జరిగింది. అమ్మాయి జాతకంలో సంవత్సరం పొరబాటుగా రాయటం జరిగింది. తరువాత నా డైరీ చూసుకుంటే మీకంటే అమ్మాయికి రెండేళ్లు ఎక్కువని తేలింది రెండవ అమ్మాయి జాతకం మీదానితో ఈడులోను మిగతా విషయాలలోనూ బాగా కుదిరింది. అమ్మాయిని చూస్తారా?"అని అడిగాడు.

అతడు చూసి సంతృప్తిగా తలఊపి వెళ్ళిపోయాడు.

అవే కట్నాలూ, అవే కానుకలూ కనుక పెళ్ళివారికి అంగీకారమయింది.

కనకమ్మ ఉత్సాహంతో పెళ్ళిపనులు చేస్తున్నది. బంధువులకు ఆహ్వానాలు వెళ్ళాయి. ఇల్లంతా సందడిగా ఉంది.

మరునాడు కృష్ణస్కూలుకు వెళ్ళగానే "అమ్మాయీ! ఇవాళ పత్రికలో ఒక మంచివార్త చదివాను. ఢిల్లీలో జాతీయ చిత్రకళాప్రదర్శన జరుగబోతున్నదట. మీరిద్దరూ మీచిత్రాలను తీసుకుని మీ అదృష్టాలను పరీక్షించుకోవచ్చు. తప్పకుండా వెళ్ళండి. దేశవిదేశాల చిత్రకళాకారులను కలుసుకోవచ్చు" అంటూ పత్రికను కృష్ణ చేతికిచ్చాడు.

''మొదటిసారి మా ఆచార్యులవారు కూడా వచ్చి, మా చిత్రాలను ప్రదర్శనలో పెట్టటానికి అనుమతిని పొంది వాటిని పెట్టించాలి. మేమిద్దరం మీ శిష్యులమని చెప్పాలి. మొదటిసారి కనుక గురువులతో వెళ్ళటమే ఉచితం'' అన్నది, ప్రాధేయపూర్వకంగా కృష్ణ.

రేఖ, కృష్ణ ఆయనను అంగీకరింపచేశారు.

కృష్ణ ఇంటికి రాగానే ఇల్లంతా బంధుజనంతో నిండిఉంది. అందరూ కృష్ణే పెళ్ళికూతురనుకుంటున్నారు. చిత్రప్రదర్శనకు వెళ్లటానికి తను ప్రయత్నం చేస్తున్నది. ఆచార్యులను కూడా ఒప్పించింది. కాని- ఇంటివాతావరణం చూస్తే "తండ్రిగాని తల్లిగాని డబ్బుఇస్తారా? ఈ పరిస్థితులలో తను వాళ్ళను అడగ్గలదా?" అనిపించింది. మరొకసారి వాళ్లచేత తిట్లు తినకుండా తన పని నెరవేర్చుకోవటం ఎట్లా? ఆమెకదొక విషసమస్యలా తోచింది.

ఈ సందేహం కలిగిన తరువాత ఆమె ఉత్సాహమంతా నీరుకారిపోయింది. ఆలోచనలో పడింది.

మరునాడు స్కూలుకు వెళ్ళినప్పుడు "ఆచార్యా! మనం ఢిల్లీలో ఉండటమెక్కడ? ప్రదర్శనకు దగ్గరలో ఉంటే రాకపోకలకు సులభంగా ఉంటుంది. భోజనం ఏ హోటల్లోనయినా చేయవచ్చు''అన్నది సాలోచనగా.

"ఆ ఏర్పాటు చేస్తాను. అక్కడికి దగ్గరలోనే మా మేనల్లుడు ఉన్నాడు. మన ముగ్గురికీ ఏర్పాట్లు చెయ్యమని ఇవాళే ఉత్తరం రాస్తాను. ఈ విషయంలో నీవేం బాధపడకు" అని ఆమె నిరుత్సాహన్ని పోగొట్టాడు.

అయినా చేతిలో కొంతడబ్బు ఉండాలి కదా అనుకుంది కృష్ణ.

''ఎంట్రీలు పంపటానికి ఆఖరితేది ఎల్లుండి మీరు ఇవాళే ఫీజుతోకూడా

పంపండి. అసలు ప్రదర్శనకు ఇంకా పదిరోజుల టైముంది. వెళ్లటం రెండు రోజుల ముందుగా వెళ్ళచ్చు.'' ఆచార్యుడు పత్రికలోపడిన ప్రకటనను కత్తిరించి ఇచ్చాడు.

కృష్ణ ఇంటికివెళ్లకుండా స్కూలునుంచే బజారుకు వెళ్ళింది. బాల్యంనుంచీ ఆమె మెడలో ఒక దండ ఉన్నది. దానినమ్మి రెండువేల చిల్లర పర్సులోపెట్టు కుంది. దారిలోనే చిత్రాన్ని పేక్‌చేసి, డబ్బుతో కూడా ఢిల్లీకిపంపించింది పోస్టులో.

తెల్లవారితే పెళ్ళికూతుర్ని చేస్తారు. ఇంట్లో తల్లికి కృష్ణ కనబడకపోతే చికాకు ఎక్కువవుతుంది. అరిచి కేకలు పెడుతుంది. వాటిని కృష్ణ వినదలచు కొనక ఒక చిన్న సూట్‌కేసులో ఆరాత్రే బట్టలు సర్దుకుంది. ఆచార్యులు చెప్పిన ఆయన బంధువుల ఎడ్రసు తీసుకోకుండా తెల్లవారుఝామునలేచి సూట్‌కేసు తీసి కుని బయలుదేరి, రిజర్వేషన్ లేని టికెట్‌కొనుక్కుంది. రైలు వచ్చేవేళ ఇంకా కాలేదు.

వైటింగ్‌రూములో కూర్చున్న కృష్ణకు ఢిల్లీలో ఎక్కడ ఉండాలన్న ఆలో చన అప్పుడు కలిగింది. తను ఎప్పుడూ ఢిల్లీవెళ్ళలేదు. బంధువులయినా అక్కడ లేరు. కాని కృష్ణ "రెండురోజుల ప్రయాణంలో ఏ ఆలోచనైనా కలగకపోతుందా? రైల్లో ఎవరయినా కలిసి తనకు సహాయం చేయకపోతారా''అన్న ఊహతో రైలు రాగానే ఒక కంపార్టుమెంటులో ఎక్కి కూర్చుంది. అందరూ ఎక్కిన తరువాత ఆమెకు రిజర్వేషన్ లేని సీటు ఒకటి మూలకు మిగిలింది.

ఆ కంపార్టుమెంటులో నలుగురు అమ్మాయిలు తన ఈడువారు కనబడ్డారు కాని, వాళ్లకు చిత్రకళాప్రదర్శనాన్ని గురించి తెలియదన్నారు. వాళ్ల వేషభాష లను చూసి ఎంతో చదువుకున్నవారనుకుంది. కాని, నిరాశపడలేదు. ఇంకా ఒకటిన్నర రోజుకు కాని ఢిల్లీస్టేషన్ రాదు. ఈలోపల ...... ఆమెకు ఆశచావ లేదు.

ఆకలివేసినప్పుడు ఎక్కడ ఏది దొరికితే అదే కొనుక్కుని తిన్నది. రిజ ర్వేషన్ లేదు కనుక కూర్చునే నిద్రపోయింది. కాని మనసూరుకోక ఆలోచిస్తునే ఉంది. చిత్రకళాప్రదర్శన చోటికే వెళ్ళి స్త్రీలెవరయినావస్తే ఉండటానికి వసతి కల్పించమని అడగాలనుకుంది.

ఏవేవో ఆశలు కలుగుతున్నాయి. వెంటనే కరిగిపోతున్నాయి.

పగలంతా కిటికీలోనుంచి ప్రతిస్టేషనూ చూస్తూ ఏదో కొనుక్కొని తింటూ కూర్చుంది. చీకటిపడగానే రెండు ఏపిల్సుతిని కప్పు టీ తాగి కూర్చునే నిద్ర పోయింది.

రాత్రి రెండుగంటలకు కళ్ళుతెరిచింది. కంపార్టుమెంటులో అందరూ నిద్ర పోతున్నారు. కిటికీ తలుపులన్నీ వేసిఉన్నాయి. రైలు వేగంగా సాగిపోతున్నది.

కృష్ణ బాల్యంనుంచీ తన చదువు ఏవిధంగాసాగిందో సింహావలోకనంచేసు కోవటం మొదలుపెట్టింది. తన స్నేహితులు ప్రతి సంవత్సరమూ మారుతూ ఉండేవారు. కొత్తసంవత్సరం, కొత్త స్నేహితులు. వాళ్ళతో కాలక్షేపం జరుగుతూ ఉండేది. కాని తనతో ఇంటర్ చదివిన స్నేహలత మాత్రం కృష్ణనే అంటిపెట్టుకుని రెండేళ్ళు కాదు, బి.ఏ పూర్తి అయేవరకూ ఉంది. స్నేహ చాలా అల్లరిపిల్లేకాదు చిలిపిది కూడా. ఆ స్నేహ ఇప్పుడు ఏంచేస్తున్నదో ? క్రిస్టియన్లు పెళ్ళిళ్ళకు తొందరపడరు.

ఆమెను గురించి ఆలోచిస్తూ ఉండగా తటాలున మెరుపులాంటి ఆలోచన ఒకటి గుర్తుకువచ్చింది.

స్నేహలత ఢిల్లీలో వై.డబల్యూ.సి.ఏ.లో అసిస్టెంటు సెక్రటరీగా ఉన్నట్టుగా తనకు ఇటీవలకూడా ఒకటి రెండు ఉత్తరాలు రాసినట్టు జ్ఞాపకం వచ్చింది.

వెంటనే భయాలూ, బెంగలూ మాయమయ్యాయి. ఐదుగంటలకే లేచి ముఖం కడిగింది. తలదువ్వుకుని తిలకం దిద్దుకుంది. రైల్లో తోటి ప్రయాణీకులు బుట్టెడు కమలాఫలాలు కొని తనకో రెండు ఇచ్చారు. వాటిని తిన్నది. టీ అమ్మ వచ్చినప్పుడు కప్పు టీ తాగింది.

ఆ కిందటిరోజు ఆడప్రయాణీకులు ఢిల్లీలో ఆటోవాళ్లను నమ్మకూడదను కుంటున్నారు. మోసాలను గురించి చెప్పుకున్నారు.

ఆ మహానగరంలో తను స్నేహదగ్గరికి ఎట్లా వెళ్లటం ? ఇంతమంది ప్రయాణీకులున్నారు. ఎవరైనా తనను దింపివెళ్ళరా అనుకుంది. కాని ఢిల్లీస్టేషను రాగానే అందరూ మాట్లాడకుండా వాళ్లసామాన్లు తీసుకుని వెళ్ళిపోయారు.

సూట్‌కేసుతో దిగిన కృష్ణకు అంతమంది జనాన్ని చూడగానే భయంతో ఒళ్ళు జలదరించింది. కాని, ధైర్యంతెచ్చుకుని స్టేషన్‌దాటి బైటికిరాగానే పోలీసు కనబడ్డాడు. అతడు ప్రయాణీకులకు ఆటోలను మాట్లాడిపెడుతున్నాడు. ఆటో నెంబర్లు ఎక్కినవాళ్ల పేర్లు రాసుకుంటున్నాడు. ఒకనిమిషం పాటు, అతడిని అజ్ఞాతవ్యక్తులెవరో తనకు సహాయంచేయాటానికే పంపారనుకుంది.

కృష్ణ తనకు వై.డబుల్‌యూ.సి.ఏ కు ఒక ఆటోను మాట్లాడమని అడిగింది జంకుతూనే. ఆటో ఎక్కిన అరగంటలోనె వై.డబుల్‌యూ.సి.ఏ బోర్డు కనబడ్డది.

సూట్‌కేసు పట్టుకుని దిగి, ఆటోను పంపించి గేటులోపలికివెళ్ళి, అసిస్టెంటు సెక్రెటరీ స్నేహలత దగ్గరికి తీసుకువెళ్లమని నౌకర్ని అడిగింది. అతడు ఆమె ఉంటున్న రూమ్ చూపించాడు.

కృష్ణ గదిముందు నిలబడి బజర్‌నొక్కింది. తలుపు సందులోనుంచి చూస్తే స్నేహలత గురకపెట్టి నిద్రపోతున్నది.

ఎనిమిది గంటలకు ఆఫీసయితే ఇంకానిద్రా?

పదినిమిషాలయిన తరువాత మళ్ళీ బజర్ నొక్కింది.

అప్పటికి స్నేహలత లేచి ''ఎవరూ బజర్‌నొక్కేది? నా ఆఫీసువేళ ఇంకా కాలేదం"టూ తలుపుతెరిచింది.

"స్నేహా! నేను కృష్ణను. జ్ఞాపకం ఉన్నానా? నీ పాత స్నేహితురాలిని. నీకోసం ఇంతదూరం వచ్చాను''అంది ఆమె ముఖం చూస్తూ.

''కృష్ణ? ఎక్కడి కృష్ణ? ఆఁ? ఆఁ? అయితే నీవు కిక్కీవా? ఆఁ? హాయ్ కిక్కీ! ఎంతకాలమయింది నిన్నుచూసి? లోపలికిరా. కాఫీ టిఫిన్ తెప్పిస్తాను. నేను ఎనిమిదిగంటలకు ఆఫీసులో ఉండాలి. నీసంగతేమిటో చెప్పు?'' లోపలికి తీసుకు వెళ్ళింది.

"అమ్మా తల్లీ నీవు నన్ను గుర్తుపడతావో లేదో నని భయపడ్డాను. కాని నీవు వెనకటి చిలిపిస్నేహవే" అని తను వచ్చినసంగతి బైటపెట్టింది.

ఆమాట వినగానే స్నేహ ఎగిరి గంతేసింది. "సెలవుపెట్టి నేనూ వస్తాను. నాకు చిత్రాలంటే ఎంతోఇష్టం కాని ఒక్కటయినా వెయ్యలేదు సుమా- ఆ సెక్రెటరీ మహాతల్లి సెలవిస్తుందో లేదో అడుగుతాను. నీవు ఉన్నన్నాళ్ళూ సెలవు పెట్టేస్తాను. ఇవ్వకేం చేస్తుందిలే. కాస్త ఓపికతో పొగడాలి" అంటూ స్నానం చేసి డ్రెస్ చేసుకుని వచ్చింది.

ఇద్దరూ కాఫీ టిఫిన్ తీసుకున్నారు.

స్నేహ ఆఫీసుకు వెళ్ళి తిరిగివచ్చే అంతలో కృష్ణ స్నానంచేసి తయారుగా కూర్చుంది. స్నేహ కనబడినందుకు ఆమెకు చాలా సంతోషంగా ఉంది.

స్నేహ సెక్రటరీతో కాస్త ఘర్షణపడి సెలవు పదిరోజులకు సంపాదించింది. వస్తూనే "సెలవిచ్చిందిలే. నీవు చెప్పిన చిత్రకళా ప్రదర్శన ఇక్కడికి దగ్గరే కిలోమీటర్ దూరం ఉంటుందేమో ? మనం బస్సులో వెళ్ళచ్చు. ఒక పెద్ద హాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మనం కావాలంటే ఆ హాలునుకూడా ఇవాళే చూడవచ్చు" అన్నది.

భోజనం వేళయ్యేవరకూ ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. కాలేజిలో చేసిన అల్లర్లూ, మీటింగులూ స్నేహితులు-ఎన్నెన్నో ఆ కబుర్లలో దొర్లాయి.

"అన్నట్టు-కిక్కీ! మీవాళ్ళు నీకు పెళ్ళి చెయ్యలేదూ? ఈపాటికి నీకు పిల్లలేమో ననుకున్నాను" అన్నది స్నేహ.

"సరేలే ఆ గండంలోనుంచి బైటపడి ఈ పేరుమీద ఢిల్లీ వచ్చేశాను. నిన్ననే జరిగి ఉండేది పెళ్ళి. కాని - నా బదులు నా చెల్లెలికి జరుగుతోంది. ఇంకా పూర్తి అయి ఉండదు. నన్ను తిట్టుకుంటూ ఉంటారు మా అమ్మా నాన్నా".

ఇద్దరూ భోజనంచేసి బస్సులో చిత్రకళా ప్రదర్శన జరిగే హాలుకు వెళ్లారు. అక్కడ గేలరీలను ఏర్పాటుచేస్తున్నారు. ప్రదర్శనకు వచ్చిన చిత్రాలను ఒక పక్కకు పెట్టారు. అక్కడ ఒక గంటసేపు వచ్చిన చిత్రాలను చూశారుఇద్దరూ.

"నీచిత్రం ఎక్కడుందో ? కనబడదేం ?" స్నేహ కుతూహలంతో అడిగింది.

"నాదా ? ఇవన్నీ చూస్తుంటే నాది అసలు అంగీకరిస్తారో లేదో అన్నట్లుగా

ఉంది. ఈ చిత్రాల ముందర నాదేమంతగొప్పది ? వచ్చినందుకు ప్రదర్శనను చూడగలుగుతాను. నా స్నేహితురాలిని చూడగలిగాను. ఆమెతో పదిరోజులు గడపగలుగుతాను. అంతే'' అన్నది. ఆ చిత్రాలను చూసిన తరువాత ఆమెకు అధైర్యం కలగటం మొదలుపెట్టింది.

"ఆ ? అదేమిటి ? ఒకొక్క చిత్రానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుంది. నీదానిలో ఉన్న ప్రత్యేకత నీకు తెలియకపోవచ్చు. నిర్వాహకులను నేనడుగుతానుండు-ప్రదర్శనలో పెడుతున్నారా లేదా అని. అసలు నిర్ణయంచేసే కమిటీ వేరే ఉంటుంది. పెట్టింతరువాత కదా తెలిసేది ?''

నిర్వాహకుల దగ్గరికివెళ్ళి ''నిన్నా ఇవాళ పోస్టులో ఏవైనా చిత్రాలు వచ్చాయా ?" అడిగింది స్నేహ.

''వచ్చాయి కాని ఇంకా పేకెట్లు విప్పలేదని" చెప్పారు.

"సరే, మళ్ళీ నాలుగురోజులయిన తరువాత వచ్చి అడుగుదాము రా. ఊరు చూద్దాంపద".

ఆనాడు రాష్ట్రపతి భవనం, ప్రధానమంత్రి భవనం బైటినుంచి చూశారు. భోజనాలయిన తరువాత ఇండియా గేటు చూశారు.

కాఫీ టిఫిన్లు తీసుకుని ఇంటికి వచ్చారు. అలా మూడు నాలుగు రోజులు బజార్లన్నీ తిరిగారు. ఒకరోజు తెలుగు సినెమా చూశారు. ఢిల్లీయూనివర్సిటీ భవనాన్ని చూశారు.

రెండు రోజులయిన తరువాత స్నేహ కృష్ణ జాతీయ చిత్రకళా ప్రదర్శన జరగబోయే హాలుకు వెళ్లారు. హాలు ముందర పెద్ద షామియానా వేశారు. వేదిక అమర్చారు. కుర్చీలు సోఫాలు వరసగావేశారు. స్తంభాలకు ట్యూబ్ లైట్లు ఫేన్లు అమర్చారు. కృష్ణ స్నేహ లోపలికి వెళ్ళి చూశారు. గేలరీల నిండా చిత్రపటాలమర్చారు.

"ఎప్పుడు ప్రదర్శన ప్రారంభిస్తారు ?'' అడిగింది స్నేహ అక్కడున్న వాళ్ళను.

"రేపు సాయంత్రమనుకుంటే ప్రెసిడెంటుగారికి ఆ సమయానికి మరొక

ప్రోగ్రామ్ ఉందట అందువల్ల రేపు ఉదయమే ప్రారంభోత్సవం జరుగుతుంది. సరిగా పదిగంటలకు. అందరికి టెలిఫోన్లు వెళ్ళాయి. ప్రోగ్రామ్ మార్పును పేపరులో కూడా వేయించాము. ప్రేక్షకులందరూ అరగంట ముందర వారి వారి సీట్లలో ఉండాలి'' నిర్వాహకులొకరు చెప్పారు.

ఆ రాత్రంతా కృష్ణకు భయమే. తన చిత్రానికి బహుమతి లభించక పోయిన ఫరవాలేదు. కాని-ఏ చెత్తకాగితాలలో నయినా కలిసిపోకుండా ఉంటే బాగుండుననుకుని దైవప్రార్థన చేసుకుంటూ పడుకుంది కళ్ళు తెరుచుకొని.

స్నేహ కొంచెంసేపు కృష్ణను ఆటలు పట్టించింది, గాని పదిగంటలు కొట్టకముందే నిద్రపోయింది.

ఎప్పుడు తెల్లవారుతుందా అనుకుంటూ పక్కమీద దొర్లుతూ రాత్రంత గడిపిన కృష్ణ, ఆరుగంటలకే లేచి స్నానంచేసి, డ్రెస్ చేసుకుని పేపరు చదువు కుంటూ కూర్చుంది.

స్నేహ మామూలుగా లేచి తయారయి కాఫీ టిఫిన్ తెప్పించింది. ఇద్దరూ తీసుకుని బయలుదేరారు. అక్కడికి చేరుకునేసరికి పది నిమిషాలు తక్కువగా తొమ్మిదయింది.

''అరగంట ముందర వచ్చిఉంటే నీ చిత్రమెక్కడుందో చూసేవాళ్ళం'' అంది స్నేహ.

'పోనీలే ప్రోగ్రామ్ అయిన తరువాత చూడవచ్చు. ఇప్పుడేమంత మించి పోయింది ?" అన్నది కృష్ణ.

కృష్ణకేదో అసంతృప్తిగా ఉన్నదని స్నేహ తన ప్రసంగాన్ని మరొక వైపుకు మళ్ళించింది. ఏవో కబుర్లు చెబుతూ "నసీరుద్దీన్ నాతో టెన్నిస్ ఆడే వాడు జ్ఞాపకం ఉందా? అతడు కూడా చిత్రకళాకారుడు. మంచి చిత్రాలువేస్తాడు. నాతోటి పంపిస్తాననే అన్నాడు. కాని చివరకి పంపలేదట ఫోనుచేశాడు. అంత శ్రమపడి, ఎందుకు పంపలేదని అడిగితే ధైర్యం చాలలేదట. నేనా చిత్రాన్ని చూశాను కూడా. ఎండి ఆకులన్నీ రాలిపోయిన చెట్టుకొమ్మల సందుకుండా కనబడే సూర్యాస్తమయాన్ని అద్భుతంగా చూపించాడు. నేను దానికి బహుమతి లభిస్తుందనుకున్నాను. కాని పంపితేగా ?'' అంది స్నేహ.

అంతలో ప్రెసిడెంటుగారు వస్తున్నారన్న వార్త విని అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

ప్రెసిడెంటు రాగానే నిర్వాహకులు చిత్రకళా ప్రదర్శన దగ్గరికి తీసుకు వెళ్ళు ద్వారం దగ్గర రిబ్బన్ కత్తిరింపచేశారు. హాలులోపలికి తీసుకువెళ్ళి ప్రదర్శనకు వచ్చిన చిత్రాలను వరసగా చూపించారు. తరువాత వేదిక మీదికి తీసుకువెళ్ళి పెద్దకుర్చీలో ఆసీనులను చేశారు. వారితోపాటు ముగ్గురు జడ్జీలు, నిర్వాహక వర్గ సభ్యులు వేదికనలంకరించారు. కార్యదర్శి అందరికీ పూలమాలలు వేసి "ప్రారంభోత్సవం చేసినవారే అధ్యక్షులు" కనుక కార్యక్రమాన్ని నడపవలసినదిగా వారిని కోరారు.

అధ్యక్షులు బహుభాషాకోవిదులు, గొప్పవక్త.

వారు చిత్రకళను గురించి అరగంటసేపు అనర్గళంగా ఉపన్యసిస్తూ రెండవ శతాబ్దానికి ముందే చిత్రకళకొక చరిత్ర ఉందనీ, అజంతా ఎల్లోరా గుహలలో శిల్పకళనూ చిత్రకళనూ కూడా శిల్పులూ చిత్రకారులూ ప్రదర్శించారనీ, మన కావ్యాలలోని నాయికలు చాలా మంది చిత్రకారిణులకీ, చిత్రకళ మరొక ప్రపంచాన్ని సృష్టించగలదనీ అన్నారు. ఆ కళను ప్రోత్సహించడానికి చిత్రకారులకు స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని సూచించారు. మన యువచిత్రకారులు దేశపర్యటన చేసి ప్రకృతిలోని సౌందర్యాలను చిత్రాల ద్వారా గుప్తం చేయాలన్నారు.

అంతలో కార్యదర్శి బహుమతుల లిస్టును అధ్యక్షుల ఎదుట పెట్టాడు. జడ్జీలను వారికి పరిచయం చేశాడు. అధ్యక్షుల చేతిమీదుగా బహుమతి ప్రదానం జరుగుతుందని ప్రకటన చేశాడు.

కార్యదర్శి పేర్లను చదువుతుండగా అధ్యక్షులు బహుమతి ప్రదానం చేస్తున్నారు.

మొదటి బహుమతి కుమారి కృష్ణ అని, ఆ చిత్రపటాన్ని సభ్యులకు చూపించాడు కార్యదర్శి. ఆమెను వేదిక మీదికి ఆహ్వానించారు.

కృష్ణ గజగజ ఒణుకుతూ అడుగులో అడుగులేసుకుంటూ వెళ్ళింది వేదిక మీదికి.

పాతికవేల రూపాయల సంచీ బిడ్డనెత్తుకున్న ఆంధ్ర యువతి జ్ఞాపికను అధ్యక్షులామెకు బహూకరిస్తూ "ప్రకృతిని ఇంకా ఇంకా పరిశీలన చెయ్యి. నీవు కుమారివా శ్రీమతివా ?" అన్నారు నవ్వుతూ.

''కుమారినండి"

''కుమారివై ఉండి భార్యాభర్తల ప్రేమను బిడ్డపట్ల ప్రేమనూ అద్భుతంగా చిత్రించావు. ప్రతి దేశానికీ ఒక సంస్కృతీ నాగరికత ఉంటుంది. వాటిని జాగ్రత్తగా గమనించు ప్రకృతి దృశ్యాలను బాగా పరిశీలన చేసి అంతర్జాతీయంగా గొప్ప బహుమానాన్ని గెలుచుకోవాలని కాంక్షిస్తున్నాను". ఆమె తల మీద చెయ్యివేసి దీవించారు.

"రెండవ బహుమతి దివాకర్'' అని ప్రకటించి, అతడు చిత్రించిన చిత్రాన్ని సభ్యులకు కనబడేటట్టు ఎత్తుగా పెట్టారు. ఒంగిపోయిన వృద్ధుడు చేతి కర్ర సహాయంతో అస్తమిస్తున్న సూర్యుడి కభిముఖంగా అడుగులు వేస్తున్నాడు. ముడతలు పడిన దేహంతో.

అతడికి శుభాకాంక్షలు తెలుపుతూ ''నీవింకా వృద్ధుడవు కాలేదు. అయినప్పుడు అట్లా నడవాలనీ ?" అతడికి పదివేల రూపాయల సంచీ, ఒక జ్ఞాపికను బహూకరించి కరచాలనం చేశారు.

"మూడవ బహుమానం శ్రీమతి సరళ'' అని ప్రకటించి, ఆమె చిత్రాన్ని తీసుకువచ్చి అధ్యక్షులకూ సభ్యులకూ చూపించాడు కార్యదర్శి.

ఆ చిత్రం చీకట్లను ఛేదించుకుంటూ అరుణ కాంతులు వెదజల్లుతూ అవతరిస్తున్న బాలభాస్కరుడుది.

శ్రీమతి సరళ తనపేరు ప్రకటించగానే వేదికమీదికి వెళ్ళింది. ఆమెకు ఎనిమిదివేల రూపాయల సంచీ భారతమాత జ్ఞాపికను బహూకరిస్తూ అధ్యక్షులు

''ఈ మూడు చిత్రాలు సజీవ చిత్రాలుగా ఉన్నాయి. ఈ ముగ్గురికీ మంచి భవిష్యత్తు ఉన్నది. వీరు స్కాలర్‌షిప్పులకోసం దరఖాస్తులను పెట్టుకోవలసినది"గా చెప్పి శుభాకాంక్షలను తెలియచేశారు.

సభ ముగిసిన తరువాత స్నేహ "అమ్మా ! కిక్కి ? ఎంతదానవయ్యావు ?

నీలో ఇంత చిత్రకళ దాగిఉందా ? నేను నమ్మలేకుండా ఉన్నాన''ని బుజమ్మీద చెయ్యేసి గుంపులో నుంచి కూల్ డ్రింక్సు ఉన్న చోటికి తీసుకువెళ్ళింది. అక్కడ అప్పటికే దివాకర్ మొహియుద్దీన్‌లతో పాటు మరొకయువకున్నాడు. ముగ్గురూ కలిసి ఐస్ క్రీమ్ తీనుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

''దివాకర్ ! నీకు అభినందనలు. రెండవ ప్రైజ్ కొట్టేశావు'' అంటూ అక్కడ ఒక అరుగులాంటిది ఉంటే దానిమీద కృష్ణతోపాటు కూర్చుంది స్నేహ.

అర్జున్ కుమార్‌ని స్నేహ ఎరుగదు. అతడు రెండు ఐస్ క్రీము కప్పులు తీసుకువచ్చి ''ప్రథమ బహుమతి గెలుచుకున్నందులకు అభినందిస్తూ ఈ ఐస్ క్రీమ్ కప్పు మేడమ్" అంటూ ముందు కృష్ణకిచ్చి తరువాత స్నేహ కొకటి ఇచ్చాడు.

వాళ్ళిద్దరూ ఐస్ క్రీమ్ కప్పులను చేతబట్టుకుని లేచి నిలబడి చూస్తున్నారు ఇతడెవరా అని.

వీళ్ళను చూసి దివాకర్ మొహియుద్దీన్ పరుగెత్తుకుంటూ వచ్చి ''ఇతడు నా స్నేహితుడు కెనడా నుంచి వచ్చాడు. చిత్రప్రదర్శన ఉందంటే తను కూడా వస్తానన్నాడు. క్షమించండి. నేనే ముందు అతడిని పరిచయం చేయవలసింది. ఆ గుంపులో నుంచి మీరు ఇప్పుడే బైటికి రాలేదనుకున్నాను. అర్జున్‌కుమార్ ! ఈమె కుమారి కృష్ణ. స్నేహ స్నేహితురాలు. ఇవాళ ప్రథమ బహుమతి గ్రహీత. ఇతడు అర్జున్‌కుమార్ అని నా స్నేహితుడు కెనడాలో ఉంటున్నాడు. తల్లిదండ్రులను చూడటానికి ఈ ఊరు వచ్చాడు.'' అని అయాసపడుతూ పరిచయం చేశాడు ఒకరినొకరికి.

''నమస్కారమండి. ఈ చిత్ర పదర్శన పూర్వకంగా మీ పరిచయమైంది. చాలా సంతోషం. ఐస్ క్రీమ్ తెచ్చిఇచ్చినందుకు కృతజ్ఞతలు'' అంటూ కృష్ణా ! తీసుకో. వారి పరిచయమైందిగా" అని "ఇప్పుడు అందరం ఐస్ క్రీమ్‌తో సరిపెట్టుకుందామా ?" అన్నది స్నేహ.

"మరేం చేద్దాం !'' దివాకర్ ముందుకు వచ్చాడు.

"ఏంచేద్దామంటే మొహియుద్దీన్ నేనూ కలిసి మీకిద్దరికీ మీ స్నేహితుడితో సహా డిన్నరిస్తాము ఈ రాత్రికి. అంతవరకూ వెన్నెలలో ఈ గ్రౌండ్సులో ఇటూ అటూ తిరుగుదాము ఏమంటారు ?'' అన్నది స్నేహ.

''అంతకంటేనా ?'' అన్నాడు దివాకర్.

ఆ సాయంత్రం ఒక టాక్సీ తీసుకుని ఐదుగురూ డిన్నర్‌కి వెళ్ళాలనుకుంటుంటే అర్జున్‌కుమార్ ''మాయింటికి వెళ్ళి ఒక స్కూటర్ తెస్తాను. టాక్సీలో ఐదుగురిని ఎక్కించుకోడు'' అంటూ పరుగుతీశాడు.

ఇంటికి వెళ్ళి తల్లితో "ఒక తెలుగు అమ్మాయికి చిత్రకళా ప్రదర్శనంలో మొదటి బహుమతి వచ్చింది. మా స్నేహితుడు దివాకర్‌కి రెండవ బహుమతి వచ్చింది. ప్రెసిడెంటు బహుమతి ప్రదానం చేశారు. అందుకే నేను భోజనానికి పగలు రాలేకపోయాను. ఇవిగో ఫొటోలు చూడండి. వాళ్ళిద్దరి ఫొటోలు తీశాను.'' అంటూ తల్లికీ తండ్రికీ చూపించాడు.

"అమ్మాయి బాగుందిరా. ఆమె వేసిన చిత్రం మొదటి బహుమతిని గెలుచుకున్నదంటే చాలా గొప్ప విషయం. ఆ అమ్మాయిని మేమెట్లా చూస్తాము ? ఆ చిత్రాన్ని కూడా చూడాలనిపిస్తోంది. ఎలా?'' అన్నారిద్దరూ.

"నేను తీసుకువెళ్తాను. ముందు చిత్రకళా ప్రదర్శన చూడండి. ఆమె చిత్రం అక్కడే ఉంటుంది ఈ ప్రదర్శన ముగిసేవరకూ. ఆ అమ్మాయి ఇప్పుడు స్నేహితులతో ఆ గ్రౌండ్సులోనే ఉంటుంది. చూడాలంటే రండి'' అన్నాడు.

అర్జున్‌కుమార్ తల్లిదండ్రులకు చిత్రప్రదర్శనలో ఆమె చిత్రాన్ని అన్నిటితో పాటు చూపించాడు. తరువాత స్నేహితుల దగ్గరికి తీసుకువచ్చాడు. అందరూ లేచి నిలబడి నమస్కారాలు పెట్టారు.

అర్జున్‌కుమార్ అందరినీ పేరుపేరున తల్లిదండ్రులకు పరిచయంచేశాడు.

అర్జున్‌కుమార్ తల్లిదండ్రులు కృష్ణను చూసి ''ఏ ఊరు ? మీనాన్నగారేం చేస్తూఉంటారు ? నీవొక్కదానవే వచ్చావా ?" అంటూ ఒకరి తరువాత ఒకరు ప్రశ్నలు వేశారు.

కృష్ణ సహజంగా బిడియంగలది. తలవంచుకుని అన్నిటికీ జవాబులు చెప్పింది.

అర్జున్‌కుమార్ తండ్రి రామేశం. రిటైరయిన సుప్రీంకోర్టు జడ్జి. ఆయనకు

ఆంధ్రులంటే తగని అభిమానం.

''ఒరే అర్జున్. మనం వీళ్ళను భోజనానికి పిలుద్దాం. ఒక తెలుగు అమ్మాయి మొదటి బహుమతి గెలుచుకుందంటే మనందరికీ గర్వకారణం. రేపు రాత్రి నా స్నేహితులు కూడా వస్తారు. అందరికీ మన ఇంట్లో డిన్నర్. వాళ్ళకు కూడా చెప్పు. మీ దివాకర్‌ని ఇట్లాపిలు" అన్నారు.

''ఏమోయ్. నీవు రెండవ బహుమతి గెలుచుకున్నావట. కంగ్రాట్స్. రేపు రాత్రికి మా యింట్లో తెలుగు మిత్రుల కందరికీ మీతోపాటు డిన్నర్, రావాలి" అన్నారు.

మొహియుద్దీన్ స్నేహ చెరొక కప్పు కాఫీ తాగి వస్తున్నారు అప్పుడే.

"మీ యిద్దరూ కూడా రేపు రాత్రి మా యింటికి డిన్నర్‌కి రండి స్నేహితులకు బహుమానాలు వచ్చిన సందర్భంలో'' అన్నారు.

ఆ రాత్రి హోటల్లో డిన్నరయింది. అలసిపోయిన కృష్ణ ఇంటికి రాగానే ఒళ్ళు తెలియకుండా నిద్రపోయింది.

తెల్లవారి స్నేహ అడిగింది "కృష్ణా, నీవింకా పదిరోజులుండాలి ఇక్కడ. ఎందుకంటే దివాకర్ నేనూ పెళ్ళిచేసుకుంటున్నాము. రిజిస్ట్రార్ ఆఫీసులో బుక్ చేసుకున్నాం నీవు ఉంటావా ?'' అడిగింది.

కృష్ణ మాట్లాడలేదు.

"ఉంటావులే. ఏంపని మించిపోయింది ఇంట్లో ?'' అంటూ ఉండగానే ఎవరో వచ్చారని నౌకరు వచ్చిచెప్పాడు.

''డ్రాయింగ్ రూములో కూర్చోబెట్టు. వస్తున్నాం'' అంటూ ''నీవుకూడా రా" అని తీసుకువెళ్ళింది స్నేహ.

అర్జున్‌కుమార్, దివాకర్ వచ్చారు.

"ఏమిటీ విశేషం ఇలా వచ్చారు ?'' అడిగింది స్నేహ.

"మనకందరికీ డిన్నర్ ఈ రాత్రికి అర్జున్‌కుమార్ తండ్రిగారు పిలిచి రమ్మన్నారు'' దివాకర్ అన్నాడు.

"మీరే కాదండీ ఆంధ్ర సంఘం వారందరూ వస్తారు'' అర్జున్‌కుమార్ అన్నాడు వెంటనే.

''సరే. మాకింత మర్యాద చేస్తామంటే కాదంటామా ?"

ఆ డిన్నర్‌కి వచ్చిన ఆంధ్ర సంఘంవారు అమ్మాయి కృష్ణతో మాట్లాడుతూ, ఆమె విషయాలన్నీ తెలుసుకున్నారు. వాళ్ళ మనసులో ఒక ఆలోచన కలిగింది.

''ఏమండీ రామేశంగారూ, ఈ జంట చక్కగా ఉంది. ఇంతమందిమి రానేవచ్చాము. వాళ్ళిద్దరూ ఇష్టపడితే పూలహారాలు తెప్పించండి. వాళ్ళచేతికున్న ఉంగరాలనే మార్చుకుంటారు. దండలు వేసుకుంటారు". అన్నాడు చనువుగా ఒక మిత్రుడు.

రామేశం గారు దిగ్గునలేచి అమ్మాయిని అబ్బాయినీ లోపలికి తీసుకువెళ్ళి పెళ్ళి విషయం ప్రస్తావిస్తే కృష్ణ సిగ్గుతో తలవంచుకుంది. అర్జున్‌కుమార్ ఆ మధ్యాహ్నమే ఆ అమ్మాయిని గురించి తల్లితో ప్రస్తావించాడు. "అమ్మా, నీవడిగి చూడు'' అని.

తల్లి రాజేశ్వరమ్మగారు హాలు ఊడ్చి గబగబా రెండు పీటలు తెచ్చి వేసింది. ఆంధ్ర సంఘసభ్యులంతా లోపలికివచ్చి కృష్ణ, అర్జున్ కుమారులను కూర్చోబెట్టి ఉంగరాలు మార్పించి పూలహారాల మార్పిడి చేయించారు. రాజేశ్వరమ్మగారు తన చేతిగాజులు నాలుగు తీసి అమ్మాయి చేతులకు వేసింది. మెళ్ళో హారాలు తీసి అమ్మాయి మెడలో వేసింది.

ప్రధానం జరిగిపోయింది.

అందరూ భోజనాలు చేశారు. కృష్ణను స్నేహ "ఉండిపోతావా-వస్తావా" అని అడిగింది.

వెంటనే రాజేశ్వరమ్మ గారు "ఇప్పుడు రాదమ్మా. అబ్బాయి వెళ్ళేలోపల తిరుపతి తీసుకువెళ్ళి స్వామివారి ఎదుట మంగళసూత్రం కట్టించేస్తాము. అబ్బాయి అమ్మాయిని తీసుకుపోవటానికి వీసా ఏర్పాట్లు చేస్తాడు. అమ్మాయి వెళ్లేవరకూ మా దగ్గరే ఉంటుంది. ఆమె సామాను మా అర్జున్ తీసుకువస్తాడు'' అంది.

''కృష్ణా అంతేనా ?"

"ఇప్పటికంతే. నీవు నా కాతిథ్య మిచ్చినందుకు థ్యాంక్స్," కొంచెం సేపిద్దరూ మాట్లాడుకున్నారు. "నిన్ను చూడగానే నా అదృష్టం మారింది'' అని కృష్ణ స్నేహను కౌగలించుకుంది.

భోజనాలయిన తరువాత అందరూ రామేశం గారిని అర్జున్‌కుమార్‌నీ అభినందించారు. పెళ్ళి ప్రస్తావన జరిగిందని తాంబూలాలు తీసుకుని వెళ్లారు.

కృష్ణ రాజేశ్వరమ్మ గారికీ రామేశంగారికీ నమస్కరించి వారి పాదాలను కళ్ళకద్దుకుంది.

అందరూ వెళ్ళిన తరువాత-కృష్ణకు ఇంటికి వెళ్ళి తన తల్లిదండ్రులకు కూడా చెప్పి పెళ్ళిచేసుకుని అతడితో కెనడా వెళ్లాలని ఉంది. ఆ మాటే అర్జున్ కుమార్‌తో అంటే "మరొకసారి వెళ్లవచ్చులే" అని ఒప్పించి ఆమెచేత ఉత్తరం రాయించాడు-ఆమె తల్లిదండ్రులకు.

"జాతీయ చిత్రకళా ప్రదర్శనలో ప్రథమ బహుమతి గెలుచుకున్నట్టనుకున్నావా నీ మాట గెలవటానికి ?'' అర్జున్ కృష్ణను ఆటలు పట్టించాడు.

"దానికి నోరులేదు కదా'' అంది కృష్ణ.

''దానికి నోరులేదు, నాకుంది. దివాకర్‌ని పెళ్ళిచేసుకుని వాళ్ళయింటికి వెళ్ళిపోతాను. నా మాట అంటే ఏమిటనుకున్నావు ?" అంది స్నేహ సంబరంగా.